క్లుప్తంగా

బస్‌పాస్‌ల అందజేత



బస్‌పాస్‌లు అందజేస్తున్న అధికారులు

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉచితంగా బస్‌పాస్‌లు అందజేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు తెలిపారు. మొబైల్ బస్‌పాస్ కౌంటర్‌ను లింగారెడ్డి గార్డెన్ సమీపంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ స్వప్న, ఎంపీడీఓ అరుంధతి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది మహేశ్‌కుమార్, మధు, నర్సింలు, వెంకటేశ్, శ్రీనివాస్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నివారణ చర్యలు తప్పనిసరి

కౌడిపల్లి(నర్సాపూర్): వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండడంతో వరి తుకంలో ఆకు ఎండు తెగులు సోకుతుందని, నివారణ చర్యలు తీసుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాయిలాపూర్, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో వరి తుకాలను పరిశీలించారు. తుకానికి ఆకు ఎండు తెగులు ఆశిస్తుందన్నారు. నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నత్రజని సంబంధిత ఎరువులు వాడొద్దని చెప్పారు. కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు రైతుబంధు కోసం ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిధుల మంజూరుకు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో ఎంపీపీ వినోదరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని చిలప్‌చెడ్ ఎంపీపీ వినోదరెడ్డి కోరారు. మంగళవారం ఆమె కార్యాలయ భవనం అద్దె, కరెంట్ బిల్లులు, ఇంటర్నెట్ బిల్లుల నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ రాజర్షిషా, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వినోదరెడ్డి మాట్లాడుతూ.. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారని తెలిపారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



భూపతిరాజు

రామాయంపేట(మెదక్): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రవేశపెట్టిన యువతకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భూపతిరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నార్సింగిలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైవింగ్ లైసెన్స్ అత్యవసరమన్నారు. నియోజకవర్గ పరిధిలోని నార్సింగి, చేగుంట మండలాల యువత దుబ్బాకలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తండాల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మహేష్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్యా తండాలో జెడ్పీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మొదటి ప్రాధాన్యత తాగునీటితో పాటు రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రికార్డులు పూర్తి చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మరో రెండు రోజుల్లో ప్రతి గ్రామంలో పంచాయతీ రికార్డులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ రికార్డులు సైతం పూర్తి చేయాలని ఎంపీడీఓ శశిప్రభ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం, సామ్లు తండా, సోమక్కపేట్, రహీంగూడ తండాల్లో పంచాయతీ రికార్డులు, ఎన్ఆర్ఈజీఎస్ రిజిస్టర్లు, క్రీడా ప్రాంగణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజు గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాంకుమార్, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల 'కస్తూర్బా'

- అధ్యాపకులు లేరు.. పుస్తకాలు రాలేదు
- ఒకే గదిలో ఫస్టియర్, సెకండియర్ తరగతులు
- నేలపైనే చదువులు.. తరగతి గదిలోనే నిద్ర



అల్లాదుర్గం కేజీబీవీలో ఒకే గదిలో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థినులు

అల్లాదుర్గం(మెదక్): పేద విద్యార్థినులకు కళాశాల విద్యనందించేందుకు ప్రభుత్వం కేజీబీవీలో కళాశాల విద్యకు శ్రీకారం చుట్టింది. అయితే పాఠశాల భవనంలోనే కళాశాల నిర్వహించడంతో విద్యార్థినులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒకే గదిలో ఫస్టియర్, సెకండియర్ తరగతులకు విద్యా బోధన సాగిస్తున్నారు. కళాశాల తరగతులు ప్రారంభమై నెల రోజులు దాటిన పుస్తకాలు, నోట్ బుక్‌లు అందించలేదు. మరోవైపు గెస్ట్ లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యా బోధన జరగడం లేదు. నేలపైనే చదువులు సాగుతుండగా.. తరగతి గదిలోనే నిద్ర, భోజనాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇది అల్లాదుర్గం కస్తూర్బా కళాశాల పరిస్థితి.

- 2018లో అల్లాదుర్గం కేజీబీవీకి ప్రభుత్వం కళాశాల మంజూరు చేసింది. ఈ భవనంలోనే కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు.
- సీఈసీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభించారు. ఫస్టియర్, సెకండియర్‌లో కలిపి 160 మంది బాలికలు చదువుతున్నారు.
- అయితే పాఠశాల భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో గదులు సరిపోక బాలికలు అవస్థ పడుతున్నారు.
- ఒకే గదిలో సీఈసీ గ్రూపు విద్యార్థినులు ఫస్టియర్, సెకండియర్ తరగతులు నిర్వహిస్తున్నారు.
- ఒక్కోసారి వరండాలో కూర్చోవాల్సి వస్తుందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదిలోనే భోజనాలు, పడుకుంటున్నామని తెలిపారు.
- జూన్ నుంచి కళాశాల తరగతులు ప్రారంభం కాగా గతేడాది బోధించిన గెస్ట్ లెక్చరర్లను తొలగించారు.
- ఈసారి నియమించకపోవడంతో విద్యార్థినులకు బోధన జరగడం లేదు.
- కళాశాలలో కేవలం సివిక్స్, ఎకనామిక్స్ లెక్చరర్లు మాత్రమే ఉన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కోర్సుకు బోధించే వారు అసలే లేరు.
- కళాశాల ప్రారంభమైన నెల రోజులు దాటినా ఇప్పటికీ పుస్తకాలు, నోట్‌బుక్‌ల సరఫరా చేయలేదు.
- కొంతమంది విద్యార్థినులు సీనియర్ల వద్ద పాత పుస్తకాలు తీసుకుని చదువుకుంటున్నారు.
- అయితే కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- నాలుగేళ్లుగా పనులు ముందుకు సాగకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి



కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా భవన నిర్మాణం పూర్తి కాలేదు. ప్రస్తుత భవనంలో గదులు సరిపోక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. భవనం త్వరగా నిర్మించి ప్రారంభిస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

– చందన, ఇంటర్ సెకండియర్ విద్యార్థిని

పుస్తకాలు రాలేదు



కళాశాల ప్రారంభమైన పుస్తకాలు ఇవ్వలేదు. సీనియర్ల వద్ద పాత పుస్తకాలు తీసుకున్నా. అందులో కొన్ని చిరిగిపోయాయి. ప్రభుత్వం వెంటనే పుస్తకాలు, నోట్ బుక్‌లు పంపిణీ చేయాలి.

– సునీత, సెకండియర్ విద్యార్థిని

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న పీఈటీలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలం నుంచి 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లాస్థాయిలో ఎంపికైనట్లు ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. మంగళవారం శివ్వంపేటలో మండల స్థాయిలో జరిగిన ఎంపికలో 4వ తరగతి నుంచి ముగ్గురు, 5వ తరగతి నుంచి తొమ్మిది మంది విద్యార్థులు మొత్తం 12 మందిని జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని జేఎంజే పాఠశాలలో మంగళవారం తెలంగాణ క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక నిర్వహించారు. ఈసందర్భంగా మనోహరాబాద్ నోడల్ అధికారి వెంకటస్వామి మాట్లాడుతూ.. పై అధికారుల ఆదేశాల మేరకు మండలస్థాయిలో విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశామన్నారు. వీరిలో దీక్షిత్, శ్రీనిత్‌రెడ్డి (మనోహరాబాద్), రాకేశ్ (ముప్పిరెడ్డిపల్లి), మాధవి (లింగారెడ్డిపేట), హారిక (పోతారం), మేఘన (జీడిపల్లి) ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల క్రీడల కో–ఆర్డినేటర్ మంజుల, పీఈటీలు శ్యాంసుందర్, జ్యోతి, సురేశ్, ఏఎస్ఎం వినోద, సీఆర్‌పి శిరీష, శ్రీశైలం, సీనియర్ క్రీడాకారులు ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులు రాకపోవడంతో ఆడుకుంటున్న విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేరని గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం పాఠశాల ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కాగా ఉపాధ్యాయులు ఉదయం 10 గంటల వరకు కూడా రాలేదని చెప్పారు. ఇలా అయితే విద్యార్థులకు భోదన ఎలా జరుగుతుందన్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్యానాయక్‌ను వివరణ కోరగా మంగళవారం సమయపాలన పాటించని ఉపాధ్యాయులకు మెమోలు అందజేస్తామని తెలిపారు.



మూతబడిన పల్లెగడ్డ ప్రాథమిక పాఠశాల

సెలవులో సార్.. బడి బంద్

అల్లాదుర్గం(మెదక్): పాఠశాలలో ఉన్నది ఒక్క ఉపాధ్యాయుడు.. ముగ్గురు విద్యార్థులు. ఉన్న టీచర్ సెలవులపై వెళ్లడంతో పాఠశాల మూతపడింది. మంగళవారం మండల పరిధిలోని పల్లెగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు సత్యనారాయణ సెలవు పెట్టారు. మరో టీచర్‌ను నియమించేందుకు మండలంలో ఉపాధ్యాయులు లేక పోవడంతో పాఠశాల మూతపడింది. గతేడాదే ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు చేరడంతో పాఠశాల తెరుచుకుంది. అంతకు ముందు విద్యార్థులు లేక మూతపడింది.

ముమ్మరంగా అండర్ పాస్ నిర్మాణ పనులు



నాగులపల్లి రైల్వేగేట్ సమీపంలో జరుగుతున్న పనులు

తూప్రాన్: మండలంలోని నాగులపల్లి రైల్వేగేట్ సమీపంలో అండర్ పాస్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలు అండర్ పాస్ ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాగించవచ్చని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. సికింద్రాబాద్ నుంచి నాందేడ్ వరకు విస్తరించి ఉన్న రైల్వేమార్గంలో అనేక గ్రామాల వద్ద అండర్‌పాస్ లేని కారణంగా రైలు వచ్చిన సందర్భంలో గేటు వేయడంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు నూతన పద్ధతి ద్వారా కేవలం వారం రోజుల్లో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అండర్ పాస్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఫలితంగా వాహనదారుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అండర్ పాస్ నిర్మాణంతో నాగులపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



డీసీహెచ్ఎస్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆస్పత్రి తనిఖీకి వచ్చిన డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్‌ను తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు కలిసి ఇబ్బందులను వివరించారు. ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేరని, పలువురు వైద్యులు సరిగా విధులకు హాజరు కావడం లేదని ఆరోపించారు. కిందిస్థాయి సిబ్బంది మంచి సేవలందిస్తున్నారని వివరించారు. రోగులకు అందించే భోజనం నాణ్యతగా ఉండడం లేదని చెప్పారు. శానిటేషన్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. అన్ని రకాల మందులు లేవని, చాలా మందులను రోగులు బయట కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తనకు ఏ కాంట్రాక్టర్‌తో సంబంధం లేదని.. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్, శ్రీనివాస్‌గుప్తా, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్‌జోన్: ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐబీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పటివరకు ఎందుకు తెరిపించలేదో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పట్టణానికి మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేయిస్తే ఎమ్మెల్యే అసమర్థతతో డిగ్రీ కళాశాల తరలిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయని చెప్పారు. అదే జరిగితే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్, బస్ డిపో హామీలు గాలికొదిలేశారని అన్నారు. సమావేశంలో నాయకులు విక్రమ్, విజయ్, రాంచందర్, బాబు, శ్యామయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రానికి చెందిన పలువురికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పప్పుల కిష్టారెడ్డి, నాయకులు ముస్తాఫా, లక్ష్మణ్, మహ్మద్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి, దొడ్డి కొమురయ్యకు నివాళి



నర్సాపూర్: అల్లూరి, దొడ్డి కొమురయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సాపూర్: అల్లూరి సీతారామరాజు జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కాగా మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ కౌన్సిలర్లు బుచ్చేశ్‌యాదవ్, యాదగిరితో వచ్చి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్ కౌన్సిలర్లు లలిత, లక్ష్మి, సరితతో వచ్చి నివాళులర్పించారు. ఇరువర్గాలు నివాళులు అర్పించినప్పుడు కమిషనర్ వెంకట్‌గోపాల్ పాల్గొనడం గమనార్హం. కాగా చైర్మన్, వైస్ చైర్మన్ కార్యక్రమంలో వేర్వేరు పాల్గొనడంపై కమిషనర్ వద్ద ప్రస్తావించగా మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌కు అత్యవసరంగా పార్టీ సమావేశం ఉన్నందున ముందుగా నివాళులర్పించి వెళ్లారని వివరించారు.



చేగుంటలో..

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, ప్రధానోపాధ్యాయుడు రమేశ్, తపస్ సంఘం నాయకులు లక్ష్మణ్, మాధవి, వెంకటేశ్, రామకృష్ణ, తిరుపతి, సునంద, పద్మజతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సమ్మెను విజయవంతం చేయాలి'

మనోహరాబాద్(తూప్రాన్): ఈనెల 6వ తేదీ నుంచి చేపట్టే పంచాయతీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పంచాయతీ కార్మిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా తదితర వాటి కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వామి, అంజయ్య, రమేశ్, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మురికి కాల్వ నిర్మించాలి

శివ్వంపేట(నర్సాపూర్): మురికి కాల్వ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు జంగం వెంకటేశ్ ఎంపీడీఓ నవీన్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. శివ్వంపేట పంచాయతీలోని 12 వార్డులో మురికి కాల్వ నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

◆ రైతుబంధు దరఖాస్తు గడువు పెంపు

పెద్దశంకరంపేట(మెదక్): ఈనెల 7వ తేదీ వరకు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఇన్‌చార్జి ఏఓ రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల జూన్ 16 వరకు నూతన పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు మండలంలో 1,300 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 1,100 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగితా రైతులు తమ దరఖాస్తులను ఏఈఓలకు అందించాలని సూచించారు.

◆ రిటైర్డ్ ఉద్యోగులు ఈ–ఫైల్ చేయించుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డ్ ఉద్యోగులు ఈనెల 31లోగా ఈ–ఫైల్ చేయించుకోవాలని మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23కు గాను ఆదాయపు పన్ను పెన్షన్ నుంచి తగ్గింపు పొందిన వారందరూ ఈ–ఫైల్ చేయించాలని సూచించారు. ఇందుకోసం రూ. 5 వేల అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు.

◆ 64 మందికి పరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి సీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన మహిళా క్లినిక్‌లో 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఫైర్నజ్ తెలిపారు. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ మల్లికార్జున్, ఏఎన్ఎంలు మజీదాబేగం, రేణుక, శ్రీధర్‌రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ సంఖాపూర్ ఉప సర్పంచ్‌గా అనిల్‌గౌడ్



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం సంఖాపూర్ ఉప సర్పంచ్‌గా అనిల్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈమేరకు పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనందమేరీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వార్డు సభ్యుడు అనిల్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఒకదశలో రెండువర్గాల మధ్య గొడవ జరగగా ఎంపీడీఓ వారిని శాంతింపజేశారు. గత ఉప సర్పంచ్ కేశవులు రాజీనామా చేయగా ఆయన స్థానంలో అనిల్‌గౌడ్ ఎన్నికయ్యారు.

◆ ఎమ్మెల్యే పరామర్శ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం సర్పంచ్ మంచాల లక్ష్మీనారాయణను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. లక్ష్మీనారాయణ తల్లి రాజమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రుద్రారం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఆమె వెంట జెడ్పీటీసీ పట్లోరి మాధవి రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఉన్నారు.

◆ ఆర్థిక సాయం

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేటకు చెందిన సిద్దరాంలు మంగళవారం మృతిచెందగా ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి రూ. పది వేల ఆర్థికసాయం అందజేశారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి నరేందర్‌రెడ్డి నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంగం సిద్దరాంలు, శ్రావణ్‌గౌడ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

◆ ఎల్ఈడీ బల్బులు పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం సబ్సిడీపై ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేశారు. కేంద్రం ప్రభుత్వం గ్రామ ఉజాల యోజన పథకం కింద రూ. 125కు అయిదు ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్నట్లు కంపెనీ ఏజెంట్ గణేశ్ తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు గానూ కేంద్రం ఒక్కో ఇంటికి వినియోగంలో ఉన్న కరెంట్ మీటర్ సర్వీస్ నంబర్, బిల్ ఆధారంగా బల్బులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ పట్టణ అభివృద్ధికి సహకరించండి

చేగుంట(తూప్రాన్): చేగుంట పట్టణ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు సహకరించాలని సర్పంచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పాలకమండలి సమావేశం నిర్వహించగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వార్డు సభ్యులు సర్పంచ్‌తో చర్చించారు. అనంతరం పాలకమండలి సభ్యులతో మహంకాళి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేఖ, వార్డు సభ్యులు మహేశ్, భూపాల్, సురిబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామస్తులకు సూచించారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్‌లో పలు వీధులు తిరిగి పలు సూచనలు చేశారు. రెండో వార్డులో మురికి కాల్వలు ధ్వంసం కావడంతో అండర్ డ్రైనేజీ నిర్మాణ కోసం పరిశీలించారు.

◆ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నర్సాపూర్: మండలంలోని కాగజ్‌మద్దూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పదో తరగతిలో రమ్యశ్రీ 9.7 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. కాగా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్‌రూరల్: బాలికల హాస్టల్‌లో వంట చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్వేత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్‌కు అనుబంధంగా బాలికల హాస్టల్ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇందులో పనిచేసేందుకు కేర్ టేకర్ (1), హెడ్‌కుక్ (1), అసిస్టెంట్ కుక్ (2) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు మోడల్ స్కూల్ జక్కపల్లిలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

◆ మహిళలకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం మహిళలకు వారంలో ఒక రోజు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు కోరారు. మంగళవారం చిన్నశంకరంపేట పీహెచ్‌సీతో పాటు పల్లె దవాఖానాలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందిస్తామన్నారు. కేన్సర్ లాంటి వ్యాధులను మొదటి దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని సూచించారు.

◆ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం తండా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈమేరకు మంగళవారం సర్పంచ్‌కు నిధుల మంజూరు పత్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ సీఏలు, సీసీలతో సమావేశం

నర్సాపూర్‌రూరల్: మండల సమాఖ్య కార్యాలయంలో ఎస్‌బీఐ నర్సాపూర్ బ్రాంచ్ పరిధిలోని గ్రామ సంఘాల సీఏలు, సీసీలతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో బ్యాంకు మేనేజర్ సునీల్ గాంధీ హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం సెర్ప్, బ్యాంక్ టార్గెట్ నవంబర్‌లోగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని సంఘాల్లో ఉన్న ప్రతి మహిళకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమానికి కావాల్సిన నిధులను బ్యాంకు రుణాల ద్వారా అందించడానికి ఎల్లవేళలా ముందు ఉంటామని తెలిపారు. అనంతరం మెరుగైన ఫలితాలు పొందిన సీఏలు, సీసీలను సత్కరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, ఏపీఎం మార్గం గౌరీ శంకర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.